అప్రమత్తతే ఆయుధం

- తూకాల్లో తేడాలుంటే టోల్‌ఫ్రీ 1967కు ఫిర్యాదు
- అవగాహన కల్పిస్తున్న తూనికలు కొలతల శాఖ అధికారులు


కూరగాయల మార్కెట్‌లోని కాటాలను పరిశీలిస్తున్న అధికారి (ఫైల్)


వస్తువుల తూకం పరిశీలిస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారి (ఫైల్)

చీరాల: పట్టణంలో ఓ వ్యక్తి చికెన్ షాపుకు వెళ్లి కిలో చికెన్ కొన్నాడు. తూకంలో అనుమానం వచ్చి మరోసారి తూకం వేయగా కిలోకు 150 గ్రాములు తేడా వచ్చింది. మరో సంఘటనలో సూపర్‌మార్కెట్‌లో కొనుగోలు చేసిన వస్తువులుకు ఎమ్మార్పీ రేట్లు లేవు. వాళ్ళు చెప్పిందే రేటు అన్నట్లుగా ఉండడంతో వినియోగదారుల జేబులు చిల్లవుతున్నాయి. ఇటువంటి మోసాలకు చెక్ పెట్టేందుకు తూనికలు, కొలతల శాఖ అధికారులు వినియోగదారులను అప్రమత్తం చేస్తున్నారు.

డబ్బు జాగ్రత్త

తూకంలో తేడాలు, ఎమ్మార్పీ రేట్లు, కాలపరిమితి వంటివి తప్పనిసరిగా చూసుకున్న తర్వాతే కొనుగోలు చేయాలి. అలానే తోపుడు బండ్ల వద్ద ఉండే కాటాలో తేడాలున్నాయి. వారి వద్ద ఉన్న కాటాల సక్రమంగా ఉండడం లేదు. కిలోకు 100 గ్రాముల వరకు తేడాలు వస్తున్నాయి. అలానే షాపుల్లో అమ్మే వస్తువులు కూడా ఎమ్మార్పీ ధరలు, ప్యాకింగ్ తేదీ, గడువు తేదీ వంటివి లేకుండా విక్రయాలు జరుగుతున్నాయి. తోపుడు బండ్లపై వినియోగించే కాటాలలో తూకం రాళ్ళకు బదులుగా మామూలు రాళ్ళుకు రబ్బర్ బ్యాండ్‌లు చుట్టి కాటా రాళ్ళుగా వినియోగిస్తున్నారు. ఇలా మరికొన్ని విషయాలు ఇటీవల తూనికలు కొలతల శాఖ అధికారులు తనిఖీలో బయటపడ్డాయి. చీరాల కార్యాలయం పరిధిలో మొత్తం 13 మండలాల్లోని కిరాణా షాపులు, ఫర్టిలైజర్లు, తోపుడు బండ్ల వారు వినియోగించే తూకాలపై తనిఖీలు నిర్వహిస్తున్నారు.

వినియోగదారులకు అవగాహన అవసరం

వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువులు తగినంత బరువు, నాణ్యతతో కూడి ఉన్నవో లేదో పరిశీలించుకోవాలి. ఇటీవల తూనికలు, కొలతల శాఖ బాపట్ల జిల్లా, వినియోగదారుల సమాచార కేంద్రం బాపట్ల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ కె.ఐజక్ చీరాల కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు వివిధ రకాలైన పాత్రలను వినియోగించి కూరగాయలు తూకం వేయడాన్ని గమనించారు. కాటా వేసేటప్పుడు పాత్రతో సహా సున్నా చూపించాలని కానీ కొందరు వ్యాపారస్తులు గిన్నెలతో సహా బరువు తూయడం గమనించారు. ఇలా చేస్తే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వినియోగదారులు టోల్‌ఫ్రీ నెంబర్ 1967 కు ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు సూచించారు.

ప్యాకింగ్ వస్తువులపై కనిపించని వివరాలు

హోల్‌సేల్ దుకాణాల్లో ప్యాకింగ్ వస్తువులపై వివరాలు ఉండడం లేదు. వస్తువు ఎప్పుడు తయారు చేశారు? ఎక్కడి నుంచి వచ్చింది, కస్టమర్ కేర్ నెంబర్ వంటివి కనిపించడం లేదు. రెడీమేడ్ షాపుల్లో ప్యాకింగ్ దుస్తులపై ఎమ్మార్పీ లేకుండా సొంతగా ఎమ్మార్పీ రేట్లు వేసి అమ్మకాలు చేస్తున్నారు. ప్యాకింగ్‌పై ఉన్న ధర కన్నా ఎక్కువగా అమ్మకాలు జరుగుతున్నాయి. అలానే ఎలక్ట్రానిక్ కాటాలను ప్రతి సంవత్సరం రెన్యువల్ చేయకుండా ఇష్టానుసారంగా వినియోగిస్తున్నారు. తూకం రాళ్ళపై కూడా ముద్రలు వేయించుకోకుండా అరిగిపోయిన రాళ్లతోనే వ్యాపారాలు చేస్తున్నారు.

ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువగా అమ్మితే చర్యలు

నిత్యావసర వస్తువులు, కూరగాయలు, పాలు, చికెన్ దుకాణాలు, ఫర్టిలైజర్ షాపులలో తనిఖీలు నిర్వహిస్తున్నాం. తూకాలు సక్రమంగా లేకుండా చర్యలు తీసుకుంటాం. – కె.నాగేశ్వరరావు, తూనికల కొలతల అధికారి, చీరాల

వస్తువు తూకం సరిచూసుకోవాలి



వినియోగదారులు మార్కెట్‌లో తూకం ద్వారా కొనుగోలు చేస్తే వస్తువులు, ప్యాకింగ్ చేసిన వస్తువులు, మంచి నూనె, పప్పులు, బియ్యం తగినంత బరువు, పరిమాణాన్ని పరిశీలించాలి. వినియోగదారులు సరైన అవగాహన ఉంటే నష్టపోకుండా ఉంటారు.
– డి.ఇమ్మానియేలు, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్ర కన్వీనర్

తీరప్రాంతంలో భద్రతా చర్యలు

చీరాల టౌన్: కార్తీకమాసం పురస్కరించుకుని వాడరేవు సముద్ర తీరప్రాంతానికి వచ్చే భక్తుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రూరల్ ఎస్సై ఎ.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని వాడరేవు గ్రామంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్‌పోస్టుకు కేటాయించిన సిబ్బందికి రూరల్ ఎస్సై బుధవారం పలు సూచనలు అందించారు. అలానే గజ ఈతగాళ్లతో కలిసి ఏటీవీ బైక్ ద్వారా తీరం ఒడ్డున భక్తులకు మైకుల్లో పలు సూచనలు అందించారు. ఎస్సై మాట్లాడుతూ తీర ప్రాంతానికి వచ్చే భక్తులు పోలీసుల ఆంక్షలు పాటిస్తూ సముద్ర స్నానాలు ఆచరించాలన్నారు. లోతుకు వెళ్లకుండా భక్తులు సహకరించాలని కోరారు.

బాలల హక్కులు పరిరక్షించండి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మేదరమెట్ల: బాలల హక్కులను సంరక్షించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని సీడీపీవో కృష్ణకుమారి అన్నారు. మండల కేంద్రమైన కొరిశపాడు స్త్రీ.. శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం బాలల హక్కుల వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈరోజు నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలను నిర్వహించనున్నట్లు రిసోర్స్‌సెంటర్ రీజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు తెలిపారు.ప్రతి బాలిక కనీస విద్యను అభ్యసించడం వలన బాలికలను ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయన్నారు.అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఇందిర, కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

హిందూ సమాజం ఐక్యంగా ఉండాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

చీరాల: విజయవాడలో జరిగే హైందవ శంఖారావ సభకు సన్నాహకంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం వాడరేవు ఆంజనేయస్వామి విగ్రహం వద్ద సామూహిక సాగర హారతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈమేరకు హనుమత్ ఉపాసకులు అన్నదానం చిదంబరశాస్త్రి, బాపట్ల జిల్లా సహసంయోజక్ బండారు జ్వాలా నరసింహం, హిందూ చైతన్య వేదిక, శ్రీకామాక్షి కేర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ తాడివలస దేవరాజు తెలిపారు. బుధవారం స్థానిక వీరరాఘవస్వామి దేవాలయ ప్రాంగణంలో కరపత్రం, పోస్టర్‌ను ఆవిష్కరించారు. తడవర్తి చంద్రశేఖర్, బాలాజీ, దిట్టకవి వాసుదేవాచార్యులు, సర్విశెట్టి సుబ్బరాయుడు, డాక్టర్ శబరి, గోలి మల్లికార్జున పాల్గొన్నారు.

ప్రపంచస్థాయిలో రాణించాలి


సాంబశివరావుకు ఆర్థిక సాయం అందిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

చీరాల రూరల్: అంతర్జాతీయ పోటీల్లో విజేతగా నిలిచి భారత దేశం కీర్తి ప్రతిష్టను ప్రపంచ దేశాలలో ఇనుమడింపచేయాలని చీరాల వాకర్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ పేర్కొన్నారు. ఈపురుపాలెంకు చెందిన అడిగోపుల సాంబశివరావు అనే క్రీడాకారుడు ఇటీవల మాస్టర్స్ అథ్లెటిక్స్ విభాగంలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని 100 పరుగు పందెంలో బంగారు పతకం, 200, 400 మీటర్లలో సిల్వర్ మెడల్స్ సాధించి బీహార్‌లో జరిగే అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌కు ఎంపికయ్యాడు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో అసోసియేషన్ సభ్యులు బుధవారం సాంబశివరావును ఎస్ఆర్అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానానికి ఆహ్వానించారు. బీహార్ వెళ్లేందుకు రూ. 7,000 ఆర్థిక సాయం అందించారు. సీహెచ్. గురుప్రసాద్, ఎ. వీరాంజనేయులు, ఎ. సదాశివన్నారాయణ, వి. పూర్ణచంద్రరావు, జె. కృష్ణ, చెన్నారాయణ, శ్రీనివాసరావు, బాల గంగాధరరావు, వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

రహదారులన్నీ జలమయం


పట్టణంలో కురుస్తున్న వర్షం


మసీదు సెంటర్‌లో..


దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పార్కు వద్ద నిలిచిన నీరు

- చీరాలలో భారీ వర్షం

చీరాల అర్బన్: అల్పపీడనం కారణంగా చీరాల పరిసర ప్రాంతాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. మంగళవారం నుంచి వాతావరణంలో మార్పులు వచ్చాయి. బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని పలు ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. పట్టణంలోని సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చి రోడ్డు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పార్కు, వాడరేవు బస్టాండ్, దర్బార్ రోడ్డులతో పాటు పలు ప్రాంతాల్లో మోకాటి లోతులో వర్షపునీరు నిలిచింది. అలానే దర్బార్ రోడ్డులోనూ నీరు చేరింది. డ్రైనేజీల్లో వాననీరు పారుదల లేకపోవడంతో రహదారిపై నీరు చేరింది. మురుగునీరు కూడా రోడ్డుపైకి రావడంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చీరాల, వేటపాలెం, ఈపూరుపాలెం, జాండ్రపేట ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. వర్షం కారణంగా చీరాల శివారు ప్రాంతాలు జలమయం అయ్యాయి. శివారు ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లో కూడా వర్షం నీరు నిలిచింది. వర్షం కురిసినప్పుడు ప్రతిసారీ పట్టణంలోని డ్రైనేజీల్లో వర్షం నీరు పారుదల లేక రోడ్లపై వస్తున్నాయి. డ్రైనేజీల్లో ఎప్పటికప్పుడు సిల్టు తీసివేయకపోవడం వలన వర్షం నీరు రోడ్లపై నిలిచిపోతోంది. వర్షం కారణంగా వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు.

క్లుప్తంగా

లోక్ అదాలత్ ఉపయోగించుకోండి

చీరాల రూరల్: స్థానిక కోర్టు భవన సముదాయంలో డిసెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు.

సేవాదృక్పథం ముఖ్యం


మదర్‌థెరెస్సాకు నివాళులర్పిస్తున్న వృద్ధులు

చినగంజాం: ఆపదలో ఉన్న తోటి వారికి మానవత్వంతో సేవలు అందించడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని వాల్మీకి వృద్ధాశ్రమం కార్యదర్శి ఎ. లక్ష్మి సూచించారు. బుధవారం ప్రపంచ కైండ్‌నెస్ డేని పురస్కరించుకొని వృద్ధాశ్రమంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. భారత్ నిర్మాణ్ వలంటీర్ ఏశుమల్లై గోవిందస్వామి అధ్యక్షత వహించారు. వృద్ధురాలు కాంచన తన కుమారుడుని కోల్పోవడంతో ఆమెను ఓదార్చారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చీరాల టౌన్: రిటైర్డ్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్ (ఆర్‌సీటీఏ) నూతన కార్యవర్గ ఎన్నికను బుధవారం విజ్ఞాన భారతి స్కూల్లో నిర్వహించారు. అధ్యక్షునిగా సి.వెంకటరావు, ఉపాధ్యక్షునిగా మేజర్ తోట రోశయ్య, సెక్రటరీగా జె.గంగాధరరావు, ట్రెజరర్‌గా సి.రవీంద్రకుమార్, కార్యవర్గ సభ్యులుగా మాధవరావు, ఆంజనేయులు, గోపీనాథ్, వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య, మల్లీశ్వరరావు, రత్నరాజు, శేఖర్‌బాబు ఎన్నికయ్యారు.

ఏపీఓపై దాడి దారుణం


నిరసన తెలుపుతున్న సిబ్బంది

పర్చూరు (చినగంజాం): పర్చూరు ఉపాధి హామీ ఏపీఓ బుల్లయ్యపై కత్తితో జరిగిన దాడిని ఖండిస్తూ కార్యాలయ సిబ్బంది నిరస తెలియజేశారు. బుధవారం కార్యాలయం ఎదుట నిలబడి నినాదాలు చేశారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. సిబ్బంది బత్తుల సురేష్ బాబు, ఎస్. వెంకట శ్రీలత, నందిగం రాధ, రావి నాగవరప్రసాద్, మోతీలాల్, ఎస్. గోపి, విజయ్ పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం నేరం

జె.పంగులూరు: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ విజలెన్స్ అధికారుల నేతృత్వంలో బుధవారం దాడులు నిర్వహించారు. మీటరు లేకుండా విద్యుత్ అక్రమంగా వాడుకుంటున్న ఇద్దరు, అనుమతి లేకుండా ఓవర్ విద్యుత్ వాడుకుంటున్న 6 గురిని, మీటరు ఉండి బైపాస్ చేసి అనధికారంగా విద్యుత్ వాడుకుంటున్న, అధిక లోడు వాడుకుంటున్న 64 మందికి రూ. 2,84,000 అపరాధ రుసుం విధించారు. బాపట్ల జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆంజనేయులు, అద్దంకి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వల్లూరి మస్తాన్‌రావు, అద్దంకి డివిజన్ ఇంజనీర్ దామోదరు, మార్టూరు సబ్ డివిజన్ ఇంజినీర్ సురేంద్రబాబు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు


దోమల మందు పిచికారీ చేస్తున్న కార్మికుడు



సాక్షి ఎఫెక్ట్..

వేటపాలెం: పంచాయతీ పరిధిలో పారిశుధ్యంపై కదలని మురుగు.. వదలని రోగాలు.. అంటూ సాక్షి దినపత్రికలో బుధవారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పంచాయతీ అధికారులు గ్రామంలోని అన్ని కూడళ్లలో పేరుకు పోయిన చెత్త దిబ్బలను తొలగించారు. మురుగు నీటి కాలవల వద్ద బ్లీచింగ్, దోమల నివారణకు ప్రతేక చర్యలు చేపట్టారు. అయితే ఫాగింగ్ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

చీరాల: అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని బుధవారం ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎక్సైజ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు చీరాల ఎక్సైజ్ సీఐ ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం వేటపాలెం, వాడరేవు, పాతచీరాల ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. చీరాల మండలం జాండ్రపేట కూరగాయల మార్కెట్ వద్ద పాతచీరాలకు చెందిన పెరుమాని నాగేందర్ రెడ్డి అనే వ్యక్తి వద్ద 12 ఆఫీసర్ ఛాయిస్ విస్కీ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం అమ్మడం నేరమని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు.

బియ్యం పంపిణీలో నిర్లక్ష్యం తగదు


బియ్యం పంపిణీ వ్యవస్థ పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ అనిత

కారంచేడు: గ్రామాల్లో రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమంలో నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని, వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవని ఇన్‌చార్జ్ తహసీల్దార్ అనిత అన్నారు. బుధవారం కారంచేడు సాయినగర్‌లో రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాయినగర్ నుంచి బియ్యం పంపిణీ అస్తవ్యస్తంగా ఉందని వస్తున్న ఫిర్యాదులతోనే తనిఖీలు చేపట్టాల్సి వచ్చిందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని రేషన్ బియ్యం పంపిణీ పాయింట్‌లకు హెచ్చరిస్తున్నాని చెప్పారు. ఎక్కడైనా దొరికితే వారిపై 6ఏ నమోదు చేస్తామన్నారు. ఇన్‌చార్జ్ ఆర్ఐ రామారావు, ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీల విచారణ వేగవంతం చేయండి

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాస్ పుస్తకాలు, రెవెన్యూ అజమాయిషీ, నాలా కన్వర్షన్, అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. రెవెన్యూ ఉద్యోగులు తమకు కేటాయించిన విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. డిప్యూటీ తహసీల్దార్ డి.అర్జున్, వీఆర్వోలున్నారు.

బధిరుల ఆశ్రమ పాఠశాల సందర్శన

అద్దంకి: కాకానిపాలెంలోని బధిరుల ఆశ్రమ పాఠశాలను డీఈఐసీ బృందం బుధవారం సందర్శించింది. అక్కడున్న దివ్యాంగ విద్యార్థులకు పలు పరీక్షలు నిర్వహించారు. అత్యున్నత పరీక్షలు అవసరమైన వారికి రిఫర్ చేశారు. డీఐఓ వెంకటేశ్వర్లు, కాకానిపాలెం యూపీహెచ్‌సీ ఎం. హేమ మాధురి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై సీపీఎం ప్రజాపోరు

మార్టూరు: ప్రజా సమస్యలపై సీపీఎం ఈనెల 8వ తేదీ నుంచి మొదలుపెట్టిన ప్రజా పోరు కార్యక్రమం గురువారంతో ముగియనున్నట్లు పార్టీ నాయకుడు బత్తుల హనుమంతరావు బుధవారం తెలిపారు. హనుమంతరావు స్థానిక నాయకులతో కలిసి మార్టూరు వీధుల వెంట కరపత్రాలు పంపిణీ చేస్తూ మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాల్లో రైతులు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వై. రాంబాబు, బి. సూరిబాబు, మొగల్ ఇబ్రహీం, శివ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


పోటీల్లో తలపడుతున్న క్రీడాకారిణి

వేటపాలెం: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కళాశాల సెక్రటరీ వనమా రామకష్ణారావు, కరస్పాండెంట్ ఎస్. లక్ష్మణరావు అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో కాకినాడ జేఎన్‌టీయూ పరిధిలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు బుధవారం ప్రారంభించారు. ఐకాన్ హాస్పిటల్ అధిపతి ఎస్. కొండలరావు మాట్లాడుతూ గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలన్నారు. ప్రిన్సిపాల్ కె. జగదీష్ బాబు, స్పోర్ట్స్ కౌన్సిల్ మెంబర్ అన్నం శ్రీనివాసరావు, ఎన్. శేషగిరిరావు, సి. సుబ్బారావు, ఆర్‌వీ రమణమూర్తి పాల్గొన్నారు.

23న నీటి సంఘం ఎన్నికలు

జె.పంగులూరు: నీటి సంఘం ఎన్నికలు ఈ నెల 23న జరగనున్నట్లు తహసీల్దార్ సింగారావు బుధవారం తెలిపారు. ప్రస్తుతం ఆయా గ్రామాలకు సంబంధించిన నీటి సంఘం ఎన్నికల ఓటర్ల జాబితాను 11వ తేదీ ప్రచురించామన్నారు. అభ్యంతరాలుంటే 14న అధికారులకు తెలిజేయాలని కోరారు. వాటిని పరిష్కరించి 20వ తేదీన నీటి సంఘం ఎన్నికల నిర్వహణకు సంబంధించి నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 23న ఎన్నికలు జరుగుతాయన్నారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఏకగ్రీవం

మార్టూరు: యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ మార్టూరు మండల నూతన శాఖను బుధవారం మార్టూరులో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులుగా జి. యెహోషువ, కె. లక్ష్మీకాంత్, గౌరవ అధ్యక్షులుగా పి.వెంకట్రావు, సహాధ్యక్షులుగా కె.జా కబ్, ఎస్. రమ, కోశాధికారిగా ఏ.ప్రశాంత్, ఇతర సభ్యులను ఎన్నుకొన్నారు. ఎన్నికల పరిశీలకులుగా పి. రామాంజనేయులు, కే. రవి బాబులు వ్యవహరించగా ప్రత్యేక ఆహ్వానితులుగా జిల్లా అధ్యక్షుడు కె. వినయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఏ. శ్రీనివాసరావు, కోశాధికారి ఎం. వెంకటేశ్వర్ రెడ్డి హాజరయ్యారు.

12వ రోజుకు చేరిన రిలే దీక్షలు

వేటపాలెం: పందిళ్లపల్లిలోని ప్రభుత్వం వైద్యశాల ఉన్న పెంకుటిళ్ల శిథిలావస్థకు చేరిందని దాని స్థానంలో నూతన భవనం నిర్మించాలని తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 12వ రోజుకు చేరుకున్నాయి. పెద్దలు సంఘీభావం తెలిపారు. మాజీ సర్పంచ్ బీసీ నాయులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 12వ రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మాజీ సర్పంచ్ చుండూరి వాసు, సాదు రాఘవ, దేవన హేమసుందరావు, నాచక వెంకట సుబ్బారావు, బీరక పరమేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, ఆమంచి వాసు, బసిరి రెడ్డి వరదరాజులు, గోవన బ్రహ్మయ్య, కోలా చంద్ర, గవినిశెట్టి శ్రీనివాసరావు, ఆమంచి సుబ్రహ్మణ్యం, శేఖర్ పాల్గొన్నారు.